# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తిరుమల పవిత్రతను కాపాడుతూ.. భక్తులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ గురు గోవింద్ సింగ్ కుమారుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని.. చిన్నారులు ధైర్యసాహసాలతో ముందుకు సాగాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు.
- ❖ బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం 90 కోట్ల రూపాయలకు పైగా నిధులను విడుదల చేశామని మంత్రి ఎస్. సవిత తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

=======================

ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుతూ.. భక్తులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన జిల్లా పోలీసు నూతన కార్యాలయాన్ని హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తిరుమల ప్రాంత పవిత్రతను కాపాడేలా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించామని, రాయలసీమలో ముఠా కక్ష్యలను అణచివేశామని చెప్పారు. టెక్నాలజీ సహాయంతో నేర నియంత్రణ చేయాలని, డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని ముఖ్యమంత్రి పోలీసులకు సూచిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=======================

భారతీయ పురాణ పురుషుల గురించి యువతకు, చిన్నారులకు తెలియజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుపతిలో ఈరోజు జరిగిన భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆయన పాల్గొని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి అక్కడి స్టాళ్ళను సందర్శించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... శ్రీరాముడి గురించి, రామరాజ్యం గురించి చిన్నారులకు చెప్పాలని సూచించారు. భారత్ త్వరలోనే సూపర్ పవర్ కావడం ఖాయమని చెప్పారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నిలబెడుతూ.. దేశాభివృద్ధి కోసం మోహన్ భగవత్ కృషి చేస్తున్నారన్నారు. 2 వేల 900 ఏళ్ల క్రితమే భారత్‌లో యోగాభ్యాసం ఉందని, ఇప్పుడు 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయని వెల్లడించారు. 2 వేల 600 సంవత్సరాల క్రితమే భారత్‌లో ఆయుర్వేద వైద్యం ఉందని, వందల సంవత్సరాలకు ముందు తక్షశిల, నలందా విశ్వ విద్యాలయాల్లో ఆధునిక విద్యను అందించిన ఘనత భారత్‌దేనని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

========================

శ్రీరాముడిని మించిన పురుషోత్తముడు ప్రపంచంలో ఎవ్వరూ లేరని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. వీర్ బాల్ దివస్ సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు జరిగిన కార్యక్రమాన్ని మంత్రి.. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భావి భారత పౌరులైన చిన్నారులు ధైర్యసాహసాలతో ముందుకు సాగాలని, గురు గోవింద్ సింగ్ కుమారుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నారుల్లో ధైర్యసాహసాలను వెలికితీయడమే వీర్ బాల్ దివస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ధైర్యం అంటే శత్రువులతో పోరాడటం మాత్రమే కాదని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం కూడా సాహసమేనని మంత్రి వ్యాఖ్యానించారు.

========================

వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో చదువుతున్న బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం ప్రభుత్వం 90 కోట్ల 50 లక్షల రూపాయలను విడుదల చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఈమేరకు ఆమె ఈరోజు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 2025-26 విద్యా సంవత్సరానికి గాను పీఎం యశ్వసి పథకం రెండో విడతగా కళాశాల, పాఠశాల ఓబీసీ, ఈబీసీ, డీఎన్టీ విద్యార్థుల స్కాలర్ షిప్పులు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. బీసీ చిన్నారుల విద్యకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఆర్థిక ఇబ్బందులతో బీసీ విద్యార్థులు విద్యకు దూరం కాకూడదన్నదే ఆయన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

========================

స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో ఎన్టీఆర్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు జరిగిన జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) 4వ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వివిధ శాఖలకు సంబంధించి 315 కీలక ప్రగతి సూచిక (కేపీఐ)ల్లో ఎన్టీఆర్ జిల్లా 83 స్కోరు సాధించిందన్నారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన 61 అంశాలకు సంబంధించి 11 అంశాల పరిష్కారం పూర్తయిందని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. టెండర్ల ప్రక్రియతో పాటు డీపీఆర్‌ల సత్వర రూపకల్పనపైనా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమల్లోనూ అభివృద్ధి కార్యక్రమాల్లోనూ జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

========================

నిషేధిత భూముల అంశంపై రైతులు, భూ యజమానులు తమ విజ్ఞాపనలు సమర్పించుకోవచ్చని, రెవెన్యూ అధికారులు వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. “మీ చేతికి.. మీ భూమి – 22ఏ భూస్వేచ్ఛ” పేరుతో శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సారథ్యంలో ఈరోజు జరిగిన ప్రత్యేక డ్రైవ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో 22ఏ జాబితాలోకి వెళ్లిన భూముల విషయంలో భూ యజమానులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిషేధిత భూముల అంశాన్ని ఇప్పటికే క్యాబినెట్‌లో చర్చించామని, అందుకు అనుగుణంగానే ఈ భూస్వేచ్ఛ చేపట్టామని మంత్రి పేర్కొన్నారు.

========================

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి 12 కోట్ల 60 లక్షల రూపాయల నిధులు తీసుకొచ్చామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పలు అభివృద్ధి పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి వివరించారు.

========================

భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్ లో భాగంగా తిరువనంతపురం వేదికగా మూడవ టీ-20 క్రికెట్ మ్యాచ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది. తొలి రెండు మ్యాచ్ లలో విజయం సాధించిన హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఈ మ్యాచ్ లో కూడా విజయం సాధించి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని యోచిస్తోంది.

========================

మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించే చర్యల్లో భాగంగా కిల్కారి (చిన్నారి చిరునవ్వు) కార్యక్రమం చేపడుతున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి. వీరపాండియన్ తెలిపారు. దీని ద్వారా ఐవీఆర్ఎస్ విధానంలో గర్భిణిలు, బాలింతలకు సలహాలు, సూచనలు ఇస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం ఐవీఆర్ఎస్ ద్వారా సగటున 2.5 లక్షల మంది గర్భిణులకు తల్లి, బిడ్డల ఆరోగ్య సంరక్షణ, పోషణ, టీకాల ప్రాముఖ్యత, కుటుంబ నియంత్రణ, ఇతర అంశాలపై కనీసం 4 నిమిషాల పాటు వివరిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని తెలుగుతో పాటు 13 భాషల్లో నిర్వహిస్తోందని వీరపాండియన్ తెలియజేశారు.

========================
========================